క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

పుత్తూరు: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, మెకానికల్ ఆటోమొబైల్ టెక్నీషియన్ (ఎం–టి) సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్స్ కావాలని ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టుకు పీజీ అర్హత కలిగి ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతంతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. అలాగే బీటెక్, ఎంటెక్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు ఎం–టికి అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హెల్మెట్ వాడకం శ్రీరామరక్ష



ర్యాలీ చేపడుతున్న ఎస్ఐ రాజ్‌కుమార్

కార్వేటినగరం: హెల్మెట్ వాడకం ప్రయాణంలో శ్రీరామరక్ష అని ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం పోలీస్ సిబ్బంది హెల్మెట్ వాడకంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకుల ప్రాణాలకు హెల్మెట్ రక్షణనిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనల్లో భాగంగా హెల్మెట్ వాడాలని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోవడమే కాకుండా కుటుంబాలు వీధిన పడుతాయని తెలిపారు. కార్వేటినగరం నుంచి కొల్లాగుంట వరకు సిబ్బందితో కలసి హెల్మెట్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్తపరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ హేమభూషణ్‌రెడ్డి

పుత్తూరు: పరమేశ్వరమంగళం పీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకం కింద రక్తపరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ హేమభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి బయట పడవచ్చునని తెలిపారు. తొలిసారి గర్భం ధరించిన మహిళలందరికీ పీఎంఎస్ఎంఏ కింద రక్త, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేసుకున్న వారికి జేఎస్‌వై వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో 33 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రమేష్‌బాబు, పీహెచ్ఎన్ విజయకుమారి, సూపర్‌వైజర్ లలిత, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్యామల మాట్లాడుతూ తల్లీబిడ్డకు పౌష్టికాహారం చాలా ముఖ్యమని అన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం అందరూ తమ పిల్లలకు అందించాలన్నారు. చిన్నతనం నుండి రక్తహీనత లేకుండా చూడాలని హెల్త్ సూపర్ వైజర్ శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లలు పాల్గొన్నారు.

గంగమ్మకు గొడుగు బహూకరణ



గొడుగుతో వస్తున్న గెరిగ

నగరి: గంగమ్మ దేవతకు నగరి పట్టణానికి చెందిన ఎ.సుబ్రహ్మణ్యంరెడ్డి కుమారుడు ప్రసాద్ గొడుగు ఉచితంగా అందజేశారు. గెరిగ ఉత్సవాలు, గంగమ్మ అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాల్లో వర్షం వస్తే ఇబ్బందికరంగా ఉండడంతో గొడుగును బహూకరిస్తున్నట్లు దాత తెలిపారు. జాతర నిర్వాహకులకు ఆయన గొడుగును అందజేయగా దానికి గెరిగె ఊరేగింపులో వినియోగించారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు నరసింహారెడ్డి, జ్యోతి రెడ్డి, సురేష్ నాయుడు, దయానిధి, చిరంజీవి రెడ్డి, ఇంద్రయ్య, శ్రీనివాసన్, మణిగండ, కోలా బాలాజీ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ ఆవరణలో అడవిని తలపిస్తున్న పిచ్చి మొక్కలు



పాచి పట్టి పోయిన భవనాలు



దుస్థితిలో ప్రభుత్వ భవనాలు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ క్వార్టర్స్ భవనాలు ఏళ్ల తరబడిగా మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ భవనాలు నలభయ్యేళ్ల క్రితం పంచాయతీ సమితి కేంద్రంగా ఉండేది. అల్లి జల్లమ్మ గుడి వెనుక భాగంలో అప్పట్లో బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు, పంచాయతీ విస్తరణ అధికారికి వేర్వేరుగా ప్రభుత్వ క్వార్టర్స్ భవనాలను నిర్మించారు. ఈ రెండు భవనాల్లో ఒకటి ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా మారింది. ఆ భవనం వర్షాలకు ఉరుస్తూ ఏకంగా భవనంపై చిన్న చిన్న మొక్కలు మొలిచాయి. ఆ చుట్టుపక్కల గుబురుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి, విష సర్పాలకు నిలయంగా మారింది. మరొక భవనంలో తాత్కాలికంగా రైతు భరోసా కేంద్రానికి సంబంధించి పరికరాలు, ఇతర సామగ్రి పెట్టుకోవడానికి వినియోగిస్తున్నారు. ఇందులో కొంత భాగం ఉద్యాన శాఖ కార్యాలయంగా నాలుగేళ్లకు పైగా ఉపయోగపడుతోంది. ఉద్యానవనాధికారి ఏ రోజూ ఆ భవనంలో ఉన్నది లేదు. ఈ భవనం చుట్టు పక్కల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. లక్షల ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన భవనాలు ఇలా శిథిలావస్థకు చేరుకోవడంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని నేతలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి కొత్తవి నిర్మించాలని పలువురు నేతలు స్థానిక ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ భవనాలు

ప్రజాధనం వృథా



ప్రభుత్వం ప్రజాధనంతో ప్రభుత్వ అధికారుల కోసం భవనం నిర్మిస్తే, ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడం చూస్తుంటే ప్రభుత్వ అధికారులకు ఈ భవనాలపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. ఇప్పుడైనా ప్రభుత్వ భవనాలను మరమ్మతులు నిర్వహించి ప్రజల సౌకర్యార్థం కోసం ఉపయోగించుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం.
– వెంకటేష్ రెడ్డి, పాపిరెడ్డిపల్లి గ్రామం

మరమ్మతులు చేపట్టండి



శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ భవనాలను వెంటనే మరమ్మతులు నిర్వహించాలి. నేటికీ కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు లేక ప్రభుత్వ అధికారులు ప్రైవేట్ భవనాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిస్థితి. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను బాగుచేసి వాడుకలోకి తీసుకురావాల్సిందిగా ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తున్నాం.
– సుధాకర్‌రెడ్డి, కొట్రకోన గ్రామం

గంగ జాతరకు పటిష్ట బందోబస్తు

నగరి: గంగ జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. గంగ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం గ్రామ దేవతలు ఓరుగుంటాలమ్మ, దేశమ్మల ఊరేగింపు నిర్వహించే ప్రాంతం, గంగమ్మ దేవత ఊరేగింపు సమయాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గొడవలు, అల్లర్లు సృష్టించేవారిని బైండోవర్ చేసుకుంటామన్నారు. మఫ్టీలో పోలీసు నిఘా ఉంటుందని, మద్యం మత్తులో గొడవలు, అల్లర్లకు దిగితే వారిపై చర్యలు తప్పవన్నారు. మూడు రోజులపాటు ప్రకాశం రోడ్డులో వాహనాల రాకపోకలు ఆపివేస్తామన్నారు. ప్యాసింజర్ బస్సులు, వాహనాలు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాలన్నారు. సత్రవాడ నుంచి వచ్చే టిప్పర్లు తెరణి వైపు, తడుకుపేట మీదుగా వెళ్లే ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు సహకరించాలన్నారు. శాంతియుతంగా, సాంప్రదాయబద్ధంగా జాతర నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు.



సీఐ మహేశ్వర్

మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మృతి



వెదురుకుప్పం: మండలంలోని వావిల్ చేను గ్రామానికి చెందిన దేవరగుడిపల్లె ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బోడిరెడ్డి పుష్పమ్మ సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతికి మండలంలోని వైఎస్ఆర్ సీపీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం

పాలసముద్రం: రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరమని, హెల్మెట్, మాస్కు తప్పక ధరించాలని ఎస్ఐ భారతి తెలిపారు. సోమవారం తమ సిబ్బందితో కలసి బలిజకండ్రిగ–షోళింగర్ జాతీయ రహదారిపై వాహనదారులకు ఎస్ఐ భారతి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అందరూ సహకరించాలని తెలిపారు. అనంతరం రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి ఆన్‌లైన్‌లో జరిమానా వేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చక్రవర్తి, పాల్గొన్నారు.



వాహనదారులకు జరిమానా వేస్తున్న ఎస్ఐ భారతి

సారా కాస్తున్న వ్యక్తులు అరెస్టు

పాలసముద్రం: మండలంలోని నరసింహాపురంలో సారా కాస్తున్న ముగ్గురిని సోమవారం ఎస్ఐ అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేశామన్నారు. కుప్పన్, కుట్టియప్పన్, చిట్టిబాబు నరసింహాపురం సమీపంలో సారా కాస్తున్నారని ఫిర్యాదు రావడంతో నిఘా పెట్టామని తెలిపారు. సారా కాస్తున్న స్థలాన్ని పరిశీలిస్తే ముగ్గురు సారా తయారు చేస్తున్నట్టు తెలిపారు. వెంటనే అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు. వారిపై గతంలో కూడా సారా కేసులు ఉన్నట్టు తెలిపారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



ఆర్ఎంపీలకు నోటీసులు ఇస్తున్న డాక్టర్ మౌనిక

గంగాధరనెల్లూరు: ఆర్ఎంపీలు ప్రజలు వస్తే ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక తెలిపారు. సోమవారం తూగుండ్రం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారితో డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రథమ చికిత్స చేసి, వారిని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. అలాకాకుండా రోగులకు ఇంజక్షన్ ఇవ్వడం, రక్త పరీక్ష చేయడం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్ఎంపీ డాక్టర్లకు నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యస్నేహితుడికి ఘననివాళి

కార్వేటినగరం: రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి బాల్య స్నేహితుడు డీఎం పురం గ్రామానికి చెందిన మునిరత్నం(72) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు సమాచారం అందుకున్న నారాయణస్వామి ఆ గ్రామానికి వెళ్లి తన స్నేహితుడి మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ చదువుకునే రోజుల్లో తన స్నేహితుడిగా ఉంటూ రాజకీయాల్లోనూ తోడుగా ఉన్న తన చిన్ననాటి మిత్రుని మృతి జీర్ణించుకో లేకపోతున్నానని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ వెంకటరత్నం, రవి,త్యాగ, హెడ్‌వెడ్, ఆర్. సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.



మునిరత్నం మృత దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కచ్చితమైన వివరాలు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

నగరి: యాజమాన్య ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలలోని సౌకర్యాలపై కచ్చితమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో పీఎస్ శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆమె ప్రైవేటు పాఠశాలలు, మేనేజ్‌మెంట్ పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్ ఫార్ ఎడ్యుకేషన్(యూడైస్) గురించి వివరించారు. పాఠశాలలకు సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి కచ్చితమైన సమాచారాన్ని యూడైస్ 2024–25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ డేటాను నమోదు చేయాలని, ఈ విషయాన్ని స్టేట్ డైరెక్టర్ సూచించారన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

శ్రీరంగరాజపురం: భూ అక్రమాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానికుల కథనం మేరకు మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కొత్తపల్లి గ్రామం టీడీపీ నాయకుడు వెంకట్‌రెడ్డి ఆక్రమించుకున్నారు. లక్షలు విలువ జేసే ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. గత పాలనలో స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు అక్రమాలను అడ్డుకోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాగానే అక్రమాల జోరందుకున్నాయి. అన్ని వ్యవస్థలను తాను మేనేజ్ చేసినట్లు సన్నిహితులకు చెప్పినట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు స్పందించి నిర్మాణాలను అడ్డుకుని వారపు సంత నిర్వహించేందుకు స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సురక్షితం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. జాతీయ పోషకాహార దినోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఎదుగుదల, జీవ వైవిధ్య లోపాలను నియంత్రించవచ్చన్నారు. సమతుల ఆహారం ఎంతో అవసరమన్నారు. మానవ శరీర ఆకృతి పెరగడానికి పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యవంతంగా జీవించాలంటే పోషక విలువలు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ రచయితగా బండి ప్రభాకర్‌రెడ్డి

వెదురుకుప్పం: తెలుగు భాష ఉత్తమ రచయితగా ఎంపికైన శ్రీరంగరాజపురం మండలంలోని కొత్తపల్లెమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీజీటీ ఉపాధ్యాయుడు బండి ప్రభాకర్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సత్కరించారు. చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం జరిగిన తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ భాషా ఉపాధ్యాయులు, ఉత్తమ నవలా రచయితలుగా ఎన్నికైన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మండలంలోని చవటగుంట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బండి ప్రభాకర్ తాను స్వయంగా రచించిన శ్రీకాళహస్తి–పాండురంగ మహత్యాల తులనాత్మక పరిశీలన(శివ– కేశవ లీలలు) అనే గ్రంథాన్ని రచించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గోవింద స్వామినాయుడు మార్గదర్శకత్వంలో రచించిన ఈగ్రంథాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ ఆవిష్కరించారు. దీంతో ఉత్తమ రచయితగా ఎంపికై న ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డిని ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రహీత మాట్లాడుతూ గతంలో అనేక రచనలు చేసినట్లు గుర్తు చేశారు.



బండి ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

వేడుకగా గణేష్ నిమజ్జనం

నగరి: భారీ వినాయక ప్రతిమలను సోమవారం నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు. ఈ సందర్భంగా వినాయక శిబిరాల వద్ద భక్తిపాటలతో హోరెత్తించారు. అనంతరం వినాయక ప్రతిమలను ట్రాక్టర్లలో ఎక్కించారు. బాణసంచా వేడుకల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. రంగులు చల్లుకుంటూ ఊరేగింపును కొనసాగించారు. ఇళ్లవద్ద వినాయక ప్రతిమలను పూజించిన వారు ఆ ప్రతిమలను కూడా భారీ వినాయక ప్రతిమల వద్దే ఉంచేయడంతో వాటిని కూడా ట్రాక్టర్లలో తీసుకెళ్లారు. కుప్పిరెడ్డి కండ్రిగ, బుగ్గ దేవాలయం సమీపంలోని గుంటల్లో, కీళపట్టు కుశస్థలి నది వద్ద వినాకయ ప్రతిమలను నిమజ్జనం చేశారు.

రూ.10200 పలికిన లడ్డు

బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను నిమజ్జనాన్ని పురస్కరించుకొని వేలం వేశారు. నగరి పట్టణానికి చెందిన భాస్కర్ లడ్డూను రూ.10,200లకు వేలంలో పాడుకున్నారు.

శ్రీరంగరాజపురంలో...

శ్రీరంగరాజపురం: జైజై గణేశా అంటూ సోమవారం మండలంలోని గ్రామంలో గణనాథుల నిమజ్జనం కనులపండువగా సాగింది. చవితి రోజు నుంచి మండపాల్లో కొలువుదీరి పూజలందుకున్న లంబోదరుడిని మూడో రోజు సోమవారం ఘనంగా నిమజ్జనం చేశారు. చెరువు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలం నెలకొంది. ప్రత్యేక వాహనాల్లో వినాయక విగ్రహాలను కొలువుదీర్చి డప్పు వాయిద్యాల నడుమ చిన్నారులు, పెద్దలు ఊరేగించి, నిమజ్జనం చేశారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

పాలసముద్రం: వినాయక చవితి మూడో రోజు సోమవారం విగ్రహానికి ప్రత్యేక పూజలు, కొన్ని గ్రామాల్లో నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. పందిళ్లలో భారీ వినాయక విగ్రహాలను మూడు రోజులపాటు పవిత్రంగా పూజించారు. విగ్రహాలను ట్రాక్టర్లపై గ్రామాల్లో ఊరేగించారు. యువకులు రంగులు ఒకరిపై ఒక్కరు చల్లుకుని స్వామివారి ఎదుట డప్పులు వాయిస్తూ ఆటపాటలతో ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుండి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి స్వామికి నైవేద్యం పెట్టారు. అనంతరం గ్రామానికి సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఘనంగా గణేశుని నిమజ్జనం

విజయపురం: మండలంలో గణనాథుని నిమజ్జనాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఇల్లత్తూరులో వినాయకుని విగ్రహాన్ని వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు దర్శన అనంతరం సమీపంలోని గుంట, చెరువులో నిమజ్జనం చేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అంతా నృత్య ప్రదర్శనలు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనంతో వాగు, గుంట, చెరువు పరివాహక ప్రాంతాలు పండుగ వాతావరణం కనిపించింది.

జీడీ నెల్లూరులో...

గంగాధరనెల్లూరు: వినాయక చవితి తరువాత సోమవారం మండల పరిధిలోని అనేక గ్రామాల్లో స్వామివారి నిమజ్జనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గణనాథుడికి ఘన వీడ్కోలు

వెదురుకుప్పం: పలు గ్రామాల్లో యువత వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. వినాయకుడికి ప్రత్యేక పూజల అనంతరం బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాలతో యువత సందడి చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి గంగలో కలిపేశారు. ఆళ్లమడుగు, పచ్చికాపల్లం, బొమ్మన్‌దొడ్డ, అయ్యన్నగారిపల్లెల్లో నిమజ్జనోత్సవాలను నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం చేశారు. ఆళ్లమడుగులో జరిగిన నిమజ్జనోత్సవంలో సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ధనుంజయ రెడ్డి, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.





బస్టాండు ప్రాంగణంలో నిమజ్జనానికి వినాయకుడు, చావడి నుంచి నిమజ్జనానికి తరలింపు



జీడీనెల్లూరులో నిమజ్జనానికి తరలిన గణనాథుడు



విజయపురం: ఇల్లత్తూరులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



వెదురుకుప్పం: ఆళ్లమడుగులో యువత ఆనందం మధ్య నిమజ్జనం



పాలసముద్రం: ఎస్‌కేఆర్ పురం చెరువులో విగ్రహ నిమజ్జనం



శ్రీరంగరాజపురం: 49 కొతపల్లిమిట్ట గ్రామంలో నిమజ్జనం ఊరేగింపు

పరిశుభ్రతకు పెద్దపీట



ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న కార్మికుడు

శ్రీరంగరాజపురం : పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు మెదవాడ పంచాయితీ కార్యదర్శి అమర్‌నాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదవాడ పంచాయితీలోని వాటర్‌ట్యాంక్‌ను శుభ్రపరిచి రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు తొలగించారు. పంచాయితీ పరిధిలోని మురికి నీటి గుంటలను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేశారు. అనంతరం గ్రామస్తులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

పైపులైన్ లీకేజీ మరమ్మతు చర్యలు



మరమ్మతు చేస్తున్న కూలీలు

వెదురుకుప్పం: నల్లవెంగంపల్లె పంచాయతీ తాటిమాకులపల్లెలో తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ లీకేజీకి స్థానిక సర్పంచ్ పుష్ప మరమ్మతు చర్యలు చేపట్టారు. పైపులైన్ లీకేజీతో తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగి లీకేజీ కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. గ్రామస్తులు సమస్యను సర్పంచ్ పుష్ప దృష్టికి తీసుకెళడంతో వెంటనే స్పందించి లీకేజీ నివారణకు చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాను పునరుద్దరించారు.